ప్రజాశక్తి

మంగళవారం 5 మార్చి 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

తుపాన్ బాధిత రైతులకు
6న నష్టపరిహారం పంపిణీ

సంయుక్త కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మిచౌంగ్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు ఈ నెల ఆరో తేదీన నష్టపరిహారం పంపిణీ చేయనున్నట్లు సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. స్పందన కార్యక్రమం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీల ద్వారా వినతి పత్రాలు సమర్పించారు. తన పరిధిలోని వాటికి ఆయన అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. జేసీ మాట్లాడుతూ స్పందన అర్జీలకు నిర్ణీత గడువులోగా అధికారులు పరిష్కారం చూపాలని ఆదేశించారు. మిగిలిన వాటిని పరిశీలించి, విచారించాలని ఆన్‌లైన్ ద్వారా మండల స్థాయి అధికారులకు సూచించారు. స్పందన అర్జీలు పెండింగ్‌లో ఉండరాదని స్పష్టం చేశారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో పునరావతం అవుతున్నాయని వివరించారు. ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి ప్రజలకు మేలు జరిగేలా చూడాలన్నారు. రెపల్లె ఆర్డీవో వద్ద మూడు, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ శాఖలో రెండు, చీరాల ఆర్డీవో వద్ద రెండు, సిపిడిసిఎల్ వద్ద రెండు, పోలీస్ శాఖలో ఏడు అర్జీలు పునరావతం అయ్యాయన్నారు. చుక్కల భూమి నుంచి తొలగించాలంటూ వచ్చిన దరఖాస్తులు 19 పెండింగ్‌లో ఉండడంపై ఆరా తీశారు. జర్నలిస్టుల ఇంటి స్థలాల పంపిణీ కోసం కొన్ని మండలాలలో నేటికీ భూమి గుర్తించకపోవడం ఏమిటని తహశీల్దార్లను నిలదీశారు. ప్రత్యేక దష్టి సారించి భూమి గుర్తించాలని, సత్వరమే ఆ భూమిని కేటాయించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు సమర్థంగా నిర్వహించాల న్నారు. నిర్మాణాలు పూర్తి చేసిన ప్రభుత్వ భవనాలను వారంలోగా ప్రారంభించాలని ఆయన తెలిపారు. ఉపాధి హామీ పథకం పనులు లక్ష్యం మేరకు పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, బాపట్ల ఆర్డిఓ జి.రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శ్రీధర్

ఓట్ల కోసమే పాట్లు..

- ప్రత్యేక హోదా ఊసే ఎత్తని పార్టీలు
- విభజన హామీల అమలుపై ప్రస్తావనే శూన్యం
- రాజకీయ వేదికల్లో ఒకరిపై ఒకరు విమర్శలకే ప్రాధాన్యత

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఎన్నికలు సమీపించే కొద్ది ప్రధాన రాజకీయపార్టీల వ్యూహమంతా ఓట్లు ఎలా పొందాలి? సామాజిక అంశాలను ఎలా రెచ్చగొట్టాలి? అభ్యర్థుల ఎంపికలో ఈ ఎజెండాను ఎలా ముందుకు తీసుకుపోవాలి? ఎక్కడ డబ్బుతో పనులు చక్కబెట్టుకోవచ్చు? ప్రలోభా లకు ఎవరు ఎలా లొంగుతారన్న అంశాలే ఇప్పుడు ముందుకు వచ్చాయి. ప్రజల ఎజెండా కనుమరుగవుతోంది. ప్రజా సమస్యలు పక్కదారి పట్టాయి. కనీసం వేసవిలో ముందుకు వస్తున్న తాగునీటి సమస్యపైనా మంత్రులకు పట్టడం లేదు. పార్టీల తరపున వాడివేడిగా సమావేశాలు పెడుతున్నారు. ఏదోరకంగా గెలవడమే అన్న చర్చలు తప్ప ప్రజల మన్ననలతోనే గెలుస్తామనే ధీమా మాత్రం పాలక, ప్రతిపక్షాల్లో కనిపించడం లేదు.

పార్టీల వేదికల్లోనూ.. బహిరంగ సభల్లోనూ ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. సవాళ్లు విసురుకోవడం కనిపిస్తోంది. ప్రజల దృష్టంతా ఈ వివాదాస్పద అంశాల వైపు మళ్లించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇప్పుడు వైసిపి, తెలుగుదేశం పార్టీల ఎజెండా అంతా ఇదే కనిపిస్తోంది. రాష్ట్రానికి, జిల్లాకు అన్యాయం చేసిన బిజెపిపై విమర్శలు లేవు. ఆ పార్టీ మద్దతు కోసం పాకులాడుతున్నారు. బిజెపి సహకరించకపోతే ఎన్నికల కమిషన్ నుంచి మద్దతు ఉండదనే చర్చ ముందుకు వచ్చింది. ఎన్నికలను సజావుగా నిర్వహించే ఎన్నికల సంఘంపైనా చర్చ సాగే పరిస్థితి వచ్చింది. ఎన్నికలను నిష్పక్షపాతంగా ఎంత మేరకు నిర్వహిస్తారనేదీ ప్రశ్నార్ధకంగానే మారుతోంది. రాజకీయపార్టీల ప్రలోభాలపై ఎన్నికల కమిషన్ తక్షణం స్పందించాలని సిటిజన్స్ ఫర్‌డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి పల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి డిమాండ్ చేశారు. ప్రలోభాల పర్వం జోరుగా సాగుతోంది. అన్ని రకాల అప్రజాస్వామిక పద్ధతులకు పార్టీలు తెర లేపుతున్నాయి. డబ్బుతో ఏదైనా చేయవచ్చునే చర్చను ముందుకు తెస్తున్నాయి. ఈ పార్టీలు ఎవరి వద్ద కోట్ల రూపాయల డబ్బుందో వారినే అభ్యర్థులుగా ఎంపిక చేస్తున్నాయి. ఇదే జరుగుతోంది. డబ్బులేదనే వారిని పక్కనబెడుతున్నారు. ఈ ప్రక్రియలో సీనియర్ నేతలు సైతం విస్తుపోయేలా పార్టీల పోకడ కనిపిస్తోంది. ఈ సారి ఎన్నికల్లో ఆందోళనకరం ఏమిటంటే సామాజిక అంశం కీలకంగా తీసుకొని అభ్యర్థులను మార్పులు, చేర్పులు చేశారు. దీంతో మన ఎస్సీ.. మన బీసీ అనే చర్చను ▶ 2లో

సమన్వయంతో
సిఎం పర్యటనను విజయవంతం చేయాలి

- 6న వెలిగొండను జాతికి అంకితం చేయనున్న ముఖ్యమంత్రి జగన్
- కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

సమన్వయం చేసుకొని ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేలా ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని అధికారులను కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు రెండో టన్నెల్‌ను జాతికి అంకితం చేసేందుకు ఈ నెల ఆరున రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, యర్రగొండపాలెం సమన్వయకర్త తాటిపర్తి చంద్రశేఖర్‌తో కలిసి యర్రగొండపాలెం నియోజకవర్గం దోర్నాల మండలం కొత్తూరు గ్రామం ప్రాజెక్ట్ ప్రదేశాన్ని సందర్శించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. తొలుత హెలీప్యాడ్ ప్రదేశాన్ని, అనంతరం పైలాన్ ప్రదేశాన్ని పరిశీలించి ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు తగు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. అనంతరం టన్నెల్ ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటన ముందస్తు ఏర్పాట్లపై అధికారులకు తగు సూచనలు ఆదేశాలు ఇచ్చారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ నెల ఆరున పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు రెండో టన్నెల్‌ను జాతికి అంకితం చేసేందుకు దోర్నాల మండలం కొత్తూరు గ్రామం వద్ద నున్న ప్రాజెక్టు ప్రదేశంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొననున్నారని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేలా ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అధికారులకు కేటాయించిన విధులను బాధ్యతతో నిర్వహించి ఎటువంటి చిన్న చిన్న పొరపాట్లకు తావు లేకుండా పని చేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి శాఖల వారీగా కేటాయించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. జిల్లా ఎస్పి పి.పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ప్రోటోకాల్ ప్రకారం బందోబస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి హెలీప్యాడ్, పార్కింగ్, ▶ 2లో

వెలిగొండ టన్నెల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్

'వెలిగొండ' ప్రారంభోత్సవం ఎన్నికల ట్రెండే..

- ప్రాజెక్టు పూర్తి కాకుండా ప్రారంభించాలనుకోవడం విడ్డూరం
- సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

ప్రజాశక్తి -పామూరు

వెలుగొండ ప్రాజెక్టును ప్రారంభించడానికి ముఖ్యమంత్రి రావటం ఎన్నికల ట్రెండ్‌గానే ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ అన్నారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తికాకుండా ప్రారంభించి జాతికి అంకితం చేస్తాననటం విడ్డూరంగా ఉందన్నారు. రెండు సొరంగాలు నేటికీ అసంపూర్తిగా ఉన్నాయన్నారు. ఎన్నికల వచ్చాయంటే వైసీపీకి, టిడిపిలకు వెలిగొండ ప్రాజెక్టు గుర్తుకొస్తుందని విమర్శించారు. 11 గ్రామాలలో 8 వేల కుటుంబాలకు పునరావాసం ఇవ్వకుండానే ప్రాజెక్టును జాతికి అంకితం చేయబోతున్నట్లు ప్రకటించడం సిగ్గుచేటన్నారు. నిర్వాసితులకు ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. నేటికి నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ రూ.1200 కోట్లు ఇవ్వాలన్నారు. ఈ నెల ఆరున ముఖ్యమంత్రి పర్యటన ఎన్నికల ట్రెండేనని, ప్రజలను మోసం చేయటానికే వస్తున్నారని విమర్శించారు. పశ్చిమ ప్రాంతం అభివద్ధి చెందాలంటే వెలిగొండ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రకాశం జిల్లాకు నీటి గండం ఏర్పడిందని, ఇది పాలకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. వైసిపి, టిడిపి నాయకులు ఓట్ల కోసం వస్తే ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలు పట్టని పాలకులకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. మార్కాపురం అభివద్ధి చెందాలంటే జిల్లా ఏర్పాటు చేయాలని, వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేయాలని కోరారు. ప్రజలను మోసం చేస్తున్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. యువత ఆలోచించి ప్రజల కోసం పనిచేసే నాయకులను ఎన్నుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు యాట వీరనారాయణ, సయ్యద్ గౌస్ బాషా, వేముల మాధవరావు పాల్గొన్నారు.

ఓట్ల కోసమే పాట్లు..

(మొదటిపేజీ తరువాయి)

ఆయా వర్గాల్లోకి బలంగా తీసుకుపోతున్నారు. కులాల మధ్య చిచ్చుపెట్టే వ్యూహాలు నడుస్తున్నాయి. ఇదే ప్రమాదకరంగా మారింది. కొన్ని నియోజకవర్గాల్లో ఇదే జరుగుతోంది. స్థానికంగా ప్రజలను అంటిపెట్టుకొని వారి సమస్యల కోసం పనిచేసిన నేతలకు టిక్కెట్లు ఇవ్వలేదు. పక్క జిల్లాల నుంచి కూడా ఇక్కడకు తెచ్చి అభ్యర్థులుగా పెట్టారు. ఈ ప్రాంతం.. ఆ నియోజకవర్గ ప్రజలతో ఎటువంటి అనుబంధం గానీ, వారితో సంబంధాలు గానీ లేని వారే ఎక్కువగా ఉన్నారు. వైసిపిలో ఇప్పుడు ఏడు నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపిక ఇలాగే జరిగింది. రాజకీయ బదిలీల పేరుతో ఈ వ్యవహారం నడిచింది. వీళ్ల అభ్యర్థులుగా వెళ్లి ఆయా నియోజకవర్గాల ప్రజల సమస్యలు తెలుసుకునే అంశంపై దృష్టి పెట్టడం లేదు. ఎలా గెలవాలన్న దానిపైనే కేంద్రీకరణ పెట్టారు. సామాజిక అంశాలను ముందుకు తెచ్చారు. ఇక నియోజకవర్గాల్లో సమస్యలు లేవు. ఎవరూ వీటిపై మాట్లాడటం లేదు. వైసిపి నేతలు సమావేశాల్లో ఉపన్యాసాలు వింటే చంద్రబాబుపైనే విమర్శలు చేస్తున్నారు. తెలుగుదేశం, జనసేన పొత్తులపై ఆరోపణలు చేస్తున్నారు. ఇక్కడేం చేశామనేది చెప్పడం లేదు. చెప్పడానికి ఆయన ఇక్కడ పనిచేస్తే కదా? ఎక్కడో వేరే నియోజకవర్గం నుంచి వచ్చారు. ఇక తెలుగుదేశం ఉపన్యాసాలు చూస్తే సిఎం జగన్‌ను సైకోతో అభివర్ణించడం జరుగుతోంది. సైకో పోవాలి-సైకిల్ రావాలి ఇదే నినాదంతో ఊదరగొడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాల్లేవు. పోరాటాలు చేసే వారికి మద్దతు ఇచ్చినా అధికారంలోకి వస్తే తాము మీ సమస్యలు పరిష్కారం చేస్తామనే హామీలు లేవు. అంగన్‌వాడీల పోరాటంలో తెలుగుదేశం నేతల వైఖరి ఇలాగే ఉంది. ఈ వారంలోనే ఉమ్మడి ప్రకాశంలో సిఎం జగన్ సిద్ధం పేరుతో భారీ సభను అద్దంకి సమీపంలో పెడుతున్నారు. దీని ఎజెండా ఏమిటనేది నేతలు వెల్లడించారు. 15 లక్షల మందిని సమీకరించడమే ఎజెండాగా పెట్టుకున్నారు. అక్కడ సిఎం ఉపన్యాసం రోజూ వినేదే.. అదే విధంగా తెలుగుదేశం అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ కూడా జిల్లాలో పర్యటించనున్నారు. శంఖారావం పేరుతో సభలు పెడుతున్నారు. ఎవరూ స్థానికంగా అంటే జిల్లాలో ఉండే సమస్యలపై కార్యక్రమాలు తీసుకోలేదు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తికాకపోయినా.. నిర్వాసితులకు ప్యాకేజీలు ఇవ్వకుండానే దాన్ని సిఎం జగన్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 6న ఆయన వైపాలెం రానున్నారు. అదే రోజు వెలిగొండ కూడా ప్రారంభం ఉంటుందని చెబుతున్నారు. నిర్వాసితులకు ప్యాకేజీలు ఇవ్వాలనే విషయం జిల్లా నేతలకు పట్టలేదు. ఎన్నికల్లో ఏదో రకంగా శిలాఫలకం వేస్తే తమ పేర్లు శాశ్వతంగా ఉంటాయనే ఆలోచనలోనే ఉన్నారు. ఇంకా ప్రత్యేక హోదా చర్చ అనేదే లేదు. జిల్లా వెనుకబాటుపై ప్రస్తావన లేదు. కనిగిరి, దొనకొండ పారిశ్రామికవాడలపై ఎవరూ నోరువిప్పడం లేదు. మొక్కుబడిగా అప్పుడప్పుడూ చెబుతున్నారు. విభజన హామీల ఊసేలేదు. కేంద్ర విద్యాసంస్థల జాడే లేదు. ట్రిపుల్‌ఐటీ నిర్మాణం గాలికి వదిలేశారు. ప్రైవేటు కాలేజీల్లో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు పడేపాట్లు ఎలా ఉన్నాయో ఒంగోలులో ఇటీవల విద్యార్థులు రోడ్డెక్కాక గానీ తెలియలేదు. పెరుగుతున్న ధరలను నియంత్రిస్తామనే మాటే వినిపించడం లేదు. ఉపాధి గాలికి పోయింది. సాఫ్ట్‌వేర్ రంగం కుదేలైంది. దీనిపైనా ఎక్కడా చర్చలేదు. చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగాలు లేక ఇళ్ల వద్దే ఉంటున్నారు. ఇలా ఏ సమస్య కూడా పార్టీలకు పట్టడం లేదు. ఓట్లు తప్ప ఇంకేమీ నేతలకు కనిపించడం లేదు.

16న ఆలయంలో బహిరంగ వేలం

ప్రజాశక్తి-రాచర్ల: రాచర్ల మండలం, జే పుల్లలచెరువు గ్రామ సమీపాన వెలసిన నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానానికి సంబంధించిన పనులకు గాను మార్చి 16వ తేదీన దేవస్థాన ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి బి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024 ఉగాది నుంచి 2005 సంవత్సరం అది వరకు అనగా సంవత్సరం కాలం పాటు దేవస్థానంలో తలనీలాలు, టెంకాయలు అమ్ముకోవడం, కొబ్బరి చిప్పలు పోగుచేసుకోవటం, గుండం వద్ద ఫొటోలు, పాదరక్షలు భద్రపరుచు పనులకు ఈ వేలం నిర్వహిస్తున్నట్టు ఈవో బి రమేష్ తెలిపారు.

రైతులకు సూచనలు ఇస్తున్న అధికారి (ఫైల్)

పత్తా లేని 'పొలంబడి'..!

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సమగ్ర యాజమాన్య పద్ధతులతో, తక్కువ పెట్టుబడితో వ్యవసాయం చేసేందుకు తోడ్పడే 'పొలంబడి' కార్యక్రమాన్ని ప్రస్తుతం ఎక్కడా నిర్వహించడం లేదు. ఏటా పంటకు ఆశించే చీడ పీడల నిర్మూలన, ఎరువుల వినియోగం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించి సూచనలు, సలహాలిచ్చేందుకు దశాబ్దాలుగా ప్రాచుర్యం పొందిన పొలంబడి కార్యక్రమాన్ని రద్దు చేయడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పొలాల వద్దకు అధికారులు వెళ్లి పంటలకు సోకిన తెగుళ్లు, ఇతర అంశాలపై అన్నదాతలకు అవగాహన కల్పించేవారు. గ్రామానికి 30 మంది రైతులను ఎంపిక చేసి, సమగ్ర నీటి యాజమాన్యం, ఆచరణీయ పద్ధతులు వివరించేవారు, 12 వారాల పాటు శిక్షణ ఇచ్చేవారు. యాంత్రీకరణ వల్ల కలిగే లాభాలు, సేంద్రియ ఎరువుల వినియోగం, తెగుళ్లకు అనుగుణంగా పురుగు మందుల వినియోగంపై రైతన్నలకు అవసరమైన సూచనలిచ్చేవారు. ప్రస్తుతం ఈ కార్యక్రమాన్ని అటకెక్కించారని రైతులు వాపోతున్నారు. అధిక వర్షాలు, అనావృష్టితో పంటలకు తెగుళ్లు సోకితే రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకునేవారు. ప్రస్తుతం పొలంబడి కార్యక్రమం లేకపోవడంతో తెగులుకు ఏ మందు పిచికారీ చేయాలో తెలియక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్నదాత లకు ఉపయోగపడే పొలంబడి కార్యక్రమాన్ని కొనసాగించాలని రైతులు కోరుతున్నారు.

పొలంబడి ప్రయోజనాలెన్నో..

మూడు స్థాయిల్లో వ్యవసాయాధికారులు నాలుగు రోజులు పొలంబాట పడితే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. సాగులో సమస్యలు అధికారులకు చెప్పి సస్యరక్షణ చర్యలను తెలుసుకోవచ్చు. సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. తొలిదశలోనే చీడ పీడలను గుర్తించే అవకాశముంది. చీడపీడల ఉధృతి తగ్గకపోతే శాస్త్రవేత్తలను రప్పించి రైతులకు సలహాలు ఇప్పించే ఏర్పాటు చేయొచ్చు. ఎరువులు, పురుగు మందుల యాజమాన్యం సక్రమంగా ఉంటుంది. పెట్టు బడులు తగ్గడంతో పాటు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల దిగుబడులు పెరిగేందుకు అవకాశాలుం టాయి.

'పొలంబడి' నిర్వహించాలి
ముండ్ల దానియేలు, రైతు గుర్రపుశాల

గతంలో నిర్వహించిన మాదిరిగా పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించాలి. అప్పట్లో రైతులకు పంటలకు కావ లసిన సూచనలు నేరుగా అందేవి. ప్రస్తుతం నేరుగా అందక రైతులు ఇబ్బంది పడుతు న్నారు. రైతాంగం ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పొలంబడి నిర్వహించాలి.

యాజమాన్య పద్ధతులపై సూచనలు
నీరజ, ఎడిఎ, యర్రగొండపాలెం

పొలంబడి కార్యక్రమాన్ని వారంలో రెండు రోజుల పాటు (మంగళ, బుధ వా రాల్లో) నిర్వహించే వారు. ప్రస్తుతం ఇది అమలు కావడం లేదు. ఆత్మ ఆధ్వర్యంలో ఏదో ఒకచోట నిర్వహిస్తున్నారు. అయినా ప్రతి గ్రామానికి వెళ్లి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నాం. ప్రతి గ్రామంలో సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు.

సిఎం పర్యటనను విజయవంతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

టన్నెల్ ప్రదేశంలో బ్యారికేడింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆర్అండ్‌బి అధికారులకు సూచించారు. బందోబస్తు ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పక్కాగా చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ప్రోటోకాల్ ప్రకారం స్పెషలిస్ట్ డాక్టర్లకు ఏర్పాటు చేయడంతో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అడిషనల్ ఎస్‌పి నాగేశ్వరరావు, జిల్లాపరిషత్ సీఈఓ జాలిరెడ్డి, కలెక్టర్ ఏఎస్. దినేష్‌కుమార్, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, ప్రాజెక్ట్ ఎస్ఈ అబూత్ అలీం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి, సిపిఓ వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బి ఎస్ఈ దేవా నందం, సిపిడిసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ, డిసిహెచ్‌ఎస్ ఎస్ఎన్ మూర్తి, వైసీపీ మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, ఎంపిపి గుమ్మా పద్మజ యల్లేష్ నాయ కులు అమ్మిరెడ్డి రామిరెడ్డి, రసూల్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో తనిఖీ

ప్రజాశక్తి-కంభం రూరల్

కంభం పట్టణంలో జరుగుతున్న ఇంటర్ పరీక్షా కేంద్రాలను కంభం సీఐ రామకోటయ్య సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని అధికారులను సిఐ ఆదేశించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పరీక్ష నిర్వాహకులు పాల్గొన్నారు.

పొగాకు ధర రూ.229.82

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పరిధిలోని ఒంగోలు ఒకటో పొగాకు వేలం కేంద్రానికి సోమవారం చిలంకూరు గ్రామానికి చెందిన పొగాకు రైతులు 213 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా వాటిలో 195 బేళ్ల అమ్మకాలు జరిగాయి. 18 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఈ వేలంలో పొగాకు కిలో అత్యధిక ధర రూ.230 పలుకగా అత్యల్ప ధర రూ.200 పలికింది. కిలో సరాసరి ధర రూ.229.82 పలికింది. వేలంలో 14 కంపెనీలు పాల్గొనగా వేలాన్ని వేలం కేంద్రం నిర్వహణాధికారి ఎం రవికాంత్ నిర్వహించారు.

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : Opp.చుండూరు పెట్రోల్ బంక్, అద్దంకి బస్టాండ్, ఒంగోలు.
- బంగ్లారోడ్డు, భాష్యం స్కూల్ దగ్గర, అద్దంకి-523201
- #6/97&98, వార్డు నెం.6, ఎన్టీఆర్ విగ్రహం, నాయుడు వీధి, దోర్నాల బస్టాప్ వద్ద, మార్కాపురం. ఫోన్ : 9492934845

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-03-2024 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 1,790.00 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించుకోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిస్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 80088 12798

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No: 473/2023
ఇల్లూరి నాగురి ....వాది
యెదరి
శేగినేని రాజేశ్వరి .... ప్రతివాది
To,
ప్రతివాది చిరునామా
శేగినేని రాజేశ్వరి భర్త బ్రమ్మం అలియాస్ బ్రహ్మం,
దొడ్డంపల్లి గ్రామం, గిద్దలూరు మండలం,
ప్రకాశం జిల్లా

పై నెంబర్ దావాలో మీపై దావా పరిహారం కొరకు దావా దాఖలు చేసి యున్నందున, మీకు సమను నిమిత్తము 07-03-2024 తేదికి వాయిదా వేసియున్నారు. కనుక తేదీ 07-03-2024 ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా కానీ, మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో సంజాయిషీ చెప్పుకోవలసియున్నది. లేని యెడల మీ పరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేదీ: 07-03-2024

ఇట్లు
కాకునూరి హిమశేఖరరెడ్డి,
వాది పరం న్యాయవాది,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.NO 395/2023
ఇల్లూరి నాగురి ....వాది
యెదరి
కొట్కూర్ పుల్లయ్య ..... ప్రతివాది
To,
ప్రతివాది చిరునామా
కొట్కూర్ పుల్లయ్య తండ్రి తిమ్మయ్య,
హౌస్ నెంబర్ 4-238, సి.పి నగర్,
వెలుగోడు పట్టణం, వెలుగోడు మండలం,
కర్నూలు జిల్లా ప్రస్తుతం నంద్యాల జిల్లా

పై నెంబర్ దావాలో మీపై దావా పరిహారం కొరకు దావా దాఖలు చేసి యున్నందున, మీకు సమను నిమిత్తము 07-03-2024 తేదికి వాయిదా వేసియున్నారు. కనుక తేదీ 07-03-2024 ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా కానీ, మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో సంజాయిషీ చెప్పుకోవలసియున్నది. లేని యెడల మీ పరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేదీ: 07-03-2024

ఇట్లు
కాకునూరి హిమశేఖరరెడ్డి,
వాది పరం న్యాయవాది,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.

GIDDALUR NAGARA PANCHAYAT
E-Procurement Tender Notice Roc.No.48/2022/E1,Dt.04.03.2024
Nit No.70/2023-24/E1 to 85/2023-24/E1, Dated.04.03.2024(16 works)
General Fund - Rs.92.30 Lakhs (16 works)
Further Details can be seen at 'e' procurement Market place in www.eprocurement.ap.gov.in officer inviting bids Commissioner, Giddalur Nagara Panchayat, Giddalur, Andhra Pradesh.
Ph.8978382340
Sd/- xxxxxxxxxx
Commissioner
Giddalur Nagara
Panchayat

CAUTION NOTICE
General public are hereby informed that, 1. Sri Saireddy Srinivas Reddy, 2. Smt. Saireddy Jyothi, 3. Sri Saireddy Bhaskar Reddy and 4. Sri Saireddy Venkat Reddy, are absolute owners of total land adm. Ac.15.87 cents, in Sy.No.336, Patta No.266, at China Cherlo palli Majara, Nandanavanam village and Grampanchayat, D. Hanumanthunipadu Mandal, Prakasham District, vide Regd. Sale Deeds Doc. Nos.4756/2023, 4757/ 2023, 4758/2023 and 4759/2023, from the respective vendors. It is reported that the original link documents pertaining to the above said property i.e. document Nos. 1026/1995, 1027/1995 and 1796/ 2006, under which predecessors in title, purchased the property, in the initial link, are misplaced while taking Xerox at Nandanavanam, Prakasham District, A.P., as the bag containing those documents along with other documents were stolen from the vehicle, and they were lost irrevocably and they were not traced despite diligent searches. The general public are informed to return the Original Title Deed document Nos.1026/1995, 1027/1995 and 1796/2006, within 7 days to the under signed, from date of this publication, failing which it will be presumed that the original link document Nos.1026/1995, 1027/1995 and 1796/2006, are lost irrevocably and further steps will be taken in dealing with the property, as per law and requirement, by us.

Saireddy Srinivas Reddy
Nandanavanam Village, H.M padu Mandal
Prakasham Dist
Contact no : 9177773784, 9764190191

ప్రజాశక్తి 3
మంగళవారం 5 ఫిబ్రవరి 2024

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

- కలెక్టర్ దినేష్ కుమార్
- డయల్ యువర్ కలెక్టర్‌కి స్పందన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో సోమవారం స్పందన, డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు, విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో 239 అర్జీలు వచ్చాయని, అర్జీలను నిర్దిష్ట వ్యవధిలోగా సహేతుకంగా పరిష్కరించాలన్నారు. అర్జీలను పరిష్కరించడంలో ఉన్నత ప్రమాణాలను పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పరిష్కరించలేని సమస్యలను అర్జీదారులకు స్పష్టంగా వివరించాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిష్కారంకాని సమస్యలను ఉన్నతాధికారులకు పంపాలన్నారు. ప్రజలు సంతృప్తి వ్యక్తం చేసేలా అర్జీలను పరిష్కరించాలని అధికారులకు ఆయన సూచించారు. స్పందన అర్జీలపై నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ

డయల్ యువర్ కలెక్టర్‌కి విశేష స్పందన

తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో ప్రజలు ఫోన్‌లో ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా, మండల స్థాయి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వీటిపై అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడారు.

– మార్కాపురం మండలం, రాయవరం గ్రామం నుంచి వీరారెడ్డి ఫోన్ చేసి వెలిగొండ ప్రాజెక్టు సంబంధించి తమకు రావలసిన నష్ట పరిహారాన్ని త్వరితగతిన అందించాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ స్పందిస్తూ ఈ సమస్యను పరిష్కరించాలని వెలుగొండ ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్‌ను ఆదేశించారు.

– గిద్దలూరు నుండి కె. కోటేశ్వరరావు ఫోన్ చేసి తమకు రావలసిన కోర్టు అమౌంట్ రీఫండ్ పెండింగ్ లో ఉందని, త్వరగా ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సమస్యను పరిష్కరించాలని గిద్దలూరు తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు.

కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మాధురి, లోకేశ్వరరావు, వరకుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-పిసిపల్లి

కనిగిరి నియోజకవర్గంలో భూ ఆక్రమణలకు అడ్డూ, అదుపు లేకుండా పోతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు తెలిపారు. కొందరు అధికారులు, రాజకీయ నాయకుల అండతో ఆక్రమణదారులు వాస్తవ లబ్ధిదారులపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. పిసిపల్లి మండలం పెదఇర్లపాడు పంచాయతీ పరిధిలోని కోదండరామపురం, మెట్లవారిపాలెం దళితుల భూములను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు, లబ్ధిదారులతో కలిసి సోమవారం పరిశీలించారు. అనంతరం కంకణాల మాట్లాడుతూ 1994లో ఎస్‌సి కార్పొరేషన్ 22 మంది దళిత కుటుంబాలకు 44 ఎకరాలను ప్రభుత్వం కొనుగోలు చేసి మంజూరు చేసినట్లు తెలిపారు.

భూములను పరిశీలిస్తున్న కంకణాల ఆంజనేయులు

పేదల చేతుల్లో ఉన్న భూములను పెత్తందారులు, అక్రమార్కులు అదిరింపులు బెదిరింపులకు పాల్పడి బలవంతంగా గుంజుకుంటున్నారన్నారు. ఎదిరించిన వారిపై కేసులు పెట్టి అరెస్టులకు, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని తెలిపారు. 22ఎ జాబితాలోని నిషేధిత భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయడమే కాక, లబ్ధిదారులపై దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటీవల ప్రభుత్వం దళితులకు ఆ భూములపై సంపూర్ణ హక్కులు కల్పించిందన్నారు. ఆ హక్కులు నిలబెట్టడమే ప్రభుత్వ బాధ్యతని అని తెలిపారు. ప్రభుత్వం తన బాధ్యతను విస్మరిస్తే దళితులను సమీకరించి ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

బహుమతులు అందుకుంటున్న విద్యార్థినులు

విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-శింగరాయకొండ

గుంటూరులోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాల మహిళా సంస్కృతి-2024 జాతీయస్థాయి వేడుకల్లో భాగంగా ఈనెల 1 నుంచి 2 వరకూ పేపర్ ప్రజెంటేషన్, కల్చరల్ ప్రోగ్రామ్స్, స్పోర్ట్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో శింగరాయకొండలోని మలినేని సుశీలమ్మ ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజ్‌లో కంప్యూటర్ సైన్స్ విభాగంలో ద్వితీయ, సంవత్సరం మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు పాల్గొన్నారు.కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు నీలిమ, లాస్య, షర్మిల, భాగ్యలక్ష్మి ప్రాజెక్ట్ ఎక్స్పో విభాగంలో మొదటి బహుమతిని సాధించారు. డిజైన్ థాన్‌లో కావ్య, జె.దీక్షితలకు తతీయ బహుమతిని సాధించారు. టెక్నికల్ క్విజ్‌లో డి.అనూష, జి.శ్రీలక్ష్మి, వై.పల్లవి తతీయ బహుమతిని సాధించారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు కె.కాకినాడ డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్ డిఇ డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ పెమ్మసాని, చంద్రశేఖరరావు, ఫౌండర్ అండ్ సిఇఓయు వరల్డ్ మలినేని లక్ష్మయ్య, గ్రూప్ ఆఫ్ కాలేజెస్ చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు, మలినేని సుశీలమ్మ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రాచకొండ శ్రీనివాసరావు, మోహన్ ప్రసాద్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా బాలికల వసతిగృహం

- నిర్మాణం పూర్తయినా..
ప్రారంభానికి నోచని వైనం
- విద్యార్థినులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి- సిఎస్ పురంరూరల్

మండల పరిధిలోని శీలంవారిపల్లెలో రూ.1.94 కోట్ల ఆర్ఎంఎస్ఎ నిధులతో బాలికల వసతి గృహాన్ని నిర్మించారు. భవన నిర్మాణం పూర్తయినప్పటికీ నేటి ప్రారంభించలేదు. దీంతో ఆ భవనం నిరుపయోగం మారింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినుల సౌకర్యార్థం టిడిపి ప్రభుత్వ హయాంలో బాలికల వసతి గహాన్ని మంజూరు చేసింది. భవన నిర్మాణ కోసం రూ.1.94 కోట్లు మంజూరు చేసింది. 2019 జనవరి 26న అప్పటి ఎమ్మెల్యే కదిరి బాబూరావు భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. 2021 నాటికి భవన నిర్మాణం పూర్తయ్యింది. అప్పటి నుంచి ఆ భవనాన్ని

అద్దె భవనంలో నిర్వహిస్తున్న వసతి గృహం

ప్రారంభోత్సవానికి నోచని వసతి గృహం

ప్రారంభించలేదు. విద్యార్థినులకు అనేక ఇక్కట్లు తప్పడం లేదు.

ప్లస్2 విద్యార్థినుల ఇక్కట్లు

శీలం వారిపల్లె లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ప్లస్ 2 విద్యార్థినులకు హాస్టల్ వసతి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలలో పామూరు, వెలిగండ్ల మండలాలకు చెందిన విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. వారికి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు తనకు చెందిన వ్యవసాయ ఉద్యానవన కళాశాల హాస్టల్‌లో ఉచితంగా హాస్టల్ వసతి కల్పించారు. దీంతో విద్యార్థులు తమ విద్యను కొనసాగిస్తున్నారు. నూతనంగా నిర్మించిన హాసల్ వసతి గృహన్ని ప్రారంభిస్తే విద్యార్థినుల సంఖ్యలో పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వసతి గహాన్ని ప్రారంభించి తమను ఇక్కట్ల నుంచి గట్టెక్కించాలని విద్యార్థులు కోరుతున్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విజయకుమార్

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే విజయకుమార్

ప్రజాశక్తి-చీమకుర్తి

టిడిపి తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి సంతనూతలపాడు నియోజక వర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే బిఎన్.విజయకుమార్ తెలిపారు. స్థానిక పిడతలపూడి రోడ్డు, మండల పరిషత్ కార్యాలయ రోడ్డుల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ ఇంటింటికీ తిరిగి టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల గురించి ప్రజల వివరిస్తూకరపత్రాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ పరిశీలకులు చౌటా శ్రీనివాసులు, టిడిపి రాష్ట్ర నాయకులు అడకా స్వాములు, మన్నం ప్రసాదు, గొల్లపూడి సుబ్బారావు, కాట్రగడ్డ రమణయ్య, కౌన్సిలర్ గోరంట్ల అంజలి, టిడిపి బీసీ సెల్ రాష్ట్ర నాయకులు కంకణంపాటి బుజ్జి,ఉన్నం సుబ్బారావు, యడ్లపల్లి రామబ్రహ్మం పాల్గొన్నారు.

ఆలయం వద్ద పరిశీలిస్తున్న డిఎస్‌పి రామరాజు

మహాశివరాత్రికి పటిష్ట బందోబస్తు : డిఎస్‌పి

ప్రజాశక్తి-సిఎస్‌పురం

మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు కనిగిరి డిఎస్‌పి రామరాజు తెలిపారు. మిట్టపాలెం నారాయణస్వామి ఆలయాన్ని సోమవారం పరిశీలించారు. సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ పండుగ రోజున ప్రజలు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందన్నారు. అందుకు తగిన విధంగా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. అనంతరం నారాయణస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ దేవస్థానం ఇఒ గిరిబాబు, నరసింహబాబు డిఎస్‌పిని సత్కరించి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. డిఎస్‌పి వెంట శ్రీరామ్ నాయక్, సిఎస్‌పురం ఎస్ఐ ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి -శింగరాయకొండ

జరుగుమల్లి మండలం చింతలపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ, రైతుభరోసా, హెల్త్ క్లినిక్ భవనాలను మంత్రి ఆదిమూలపు సురేష్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తనయుడు బాలినేని ప్రణీత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు గురించి ప్రజలకు వివరించారు. అనంతరం రైతులకు డబ్బాలు, పట్టలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలాజీని కలిసిన ఎంపీ సురేష్

ప్రజాశక్తి - కారంచేడు

ఎంపి సురేష్‌ను సత్కరిస్తున్న బాలాజీ

ఎంపి నందిగం సురేష్ వైసిపి పర్చూరు ఇన్చార్జి యడం బాలాజీని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. చీరాల్లోని బాలాజీ స్వగృహం వద్ద కలిశారు. పలువురు వైసిపి కార్యకర్తలనం బాలాజీకి పరిచయం చేశారు. ఎంపీ సురేష్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పర్చూరు నియోజక వర్గంలో వైసిపి విజయకేతనం ఎగురవేయాలని చెప్పారు. ఎంపీ సురేష్‌ను శాలువాతో బాలాజీ సత్కరించారు. కార్యక్రమంలో పర్చూరు మాజీ ఎంపీపీ కొల్లా వెంకట్రావు, వైసీపీ నాయకులు, చీరాల మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొరబండి సురేషు, దాసరి వెంకటరావు పాల్గొన్నారు.

సిద్ధం సభాస్థలిని పరిశీలించిన కరణం వెంకటేష్

సిద్ధం సభాస్థలం వెంకటేష్ పరిశీలన

ప్రజాశక్తి - మేదరమెట్ల

ఈనెల 10న పిచ్చుకల గుడిపాడు గ్రామం వద్ద జరుప తలపెట్టిన సిద్ధం మహాసభ ప్రదేశాన్ని వైసిపి చీరాల ఇన్చార్జి కరణం వెంకటేష్ సోమవారం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. అతని వెంట స్థానిక వైసిపి నాయకులు, అభిమానులు ఉన్నారు.

కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేస్తున్న రామకృష్ణారెడ్డి

గన్‌మెన్‌కు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - బాపట్ల

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గన్ మెన్ గోపిరెడ్డి(30) కుటుంబాన్ని మాచర్ల ఎంఎల్ఎ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోమవారం పరామర్శించారు. బాపట్ల పట్టణం ఉప్పరపాలెంలో గోపిరెడ్డి మృత దేహానికి నివాళి అర్పించారు. పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ కొంత కాలంగా మాచర్ల ఎమ్మెల్యే వద్ద గన్‌మెన్‌గా పనిచేస్తున్న గోపిరెడ్డి బాపట్లలో కుటుంబ సభ్యుల వద్దకు వచ్చేందుకు మాచర్ల నుండి ద్విచక్ర వాహనంపై ఉండగా ఆదివారం బాపట్ల మండలం ఈతేరు వద్ద ప్రధాన రహదారిపై బస్సు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టు మార్టం అనంతరం బాపట్ల పట్టణంలో ఉప్పరపాలెం గోపిరెడ్డి స్వగృహానికి తరలించిన మృతదేహానికి మాచర్ల ఎంఎల్ఎ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ వంతు రూ.5లక్షలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ౦

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్య తలు తీసుకున్న నూతన కమిషనర్ బొజ్జ శ్రీకాంత్ కలెక్టర్ రంజి త్ భాషాను సోమవారం మర్యాద పూర్వకం గా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్ బొజ్జ శ్రీకాంత్

హామీలు అమలుచేయాలని విఒఎల ధర్నా

ప్రజాశక్తి - బాపట్ల

ప్రభుత్వం విఒఎలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద వెలుగు యానిమేటర్లు సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె లక్ష్మి మాట్లాడారు. జనవరి 30, 31తేదీల్లో విజయవాడలో సెర్ప్ సీఈఒ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అన్నారు. మూడేళ్ళ కాల పరిమిత జీఒను రద్దు చేయాలని అన్నారు. రూ.10లక్షల ప్రమాద భీమా అందజేయాలని కోరారు. విఒఎలకు గుర్తింపు కార్డులు, యూనిఫాం ఇవ్వాలని అన్నారు. గ్రామ సమాఖ్యల ద్వారా రూ.రెండు వేలు వేతనాన్ని జిల్లాలో అన్ని మండలాల్లో అమలు చేయాలని అన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ మాట్లాడుతూ వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని విఒఎలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ జీఒలు ఇవ్వాలని కోరారు. స్పందనలో సమస్యల అర్జీని జెసికి అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు టి పుణ్యలక్ష్మి, వై జ్యోతి, కృష్ణకుమారి, పద్మ పాల్గొన్నారు.

స్పందనలో జెసికి వినతిపత్రం అందిస్తున్న విఒఏలు

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణ, పరిసర గ్రామ ప్రజలకు త్రాగునీరు, సాగునీటి అవసరాలకే కాకుండా వందల గ్రామాల వ్యాపార అవసరాల రవాణా వారధిగానున్న గుండ్లకమ్మ బ్రిడ్జి, జీవనది నుండి ఇసుక అక్రమ తవ్వకం దారులతో గుండ్లకమ్మ నది కాపాడాలని ప్రజా సంఘాల నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, మనం త్రిమూర్తులు, కెవిఎల్ ప్రసాద్ కోరారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారుకు సమస్యలపై వినతి పత్రాన్ని సోమవారం అందజేశారు. బ్రిడ్జికి అతి సమీపంలో ఇసుకను తరలించడం వలన బ్రిడ్జికి ముప్పు వచ్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇలా చేయడం దారుణమైన విషయమని అన్నారు. ప్రజా ప్రయోజనాలను కోసం వినియోగించకుండా అక్రమ ఆర్జున కోసం నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులు, వనరులను రేత్రింబవళ్ళు నాశనం చేస్తుంటే సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రస్తుత ఎండాకాలంలో త్రాగునీటికి ఎంతో ఇబ్బందికర పరిస్తితులను ఎదుర్కోబోతున్నామని పేర్కొన్నారు. ఇసుక అక్రమ తవ్వకం దారులను కట్టడి చేయకుంటే ప్రజలకు మంచినీటికీ ఇబ్బందులు ఎదురౌతాయని అన్నారు. ఇసుక అక్రమ తవ్వకం దారులపై ఉక్కు పాదం మోపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా ప్రయోజనాల నిమిత్తం గుండ్లకమ్మ బ్రిడ్జితో పాటు మంచినీటి బావులను కాపాడాలని కోరారు. లేకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వస్తుందని పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు హెచ్చరించారు. ప్రజా సంఘాల సభ్యులు ఎర్ర మోతు నాగయ్య మాట్లాడుతూ గుండ్లకమ్మ బ్రిడ్జి లాంటి ప్రజా అవసర కట్టడాలను కాపాడుకోలేని దుస్థితిలో మనం ఉన్నామని అన్నారు. ప్రజా సమస్యలపై స్పందించుకుంటే గుండ్లకమ్మ బ్రిడ్జ్ పాడై ఎడారిగా మారబోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చెన్నుపల్లి నాగేశ్వరావు పాల్గొన్నారు.

తహశీల్దారు ఆఫీసులో వినతి పత్రం ఇస్తున్న నేతలు

సమాజ చైతన్యానికి సాహితీవేత్తల కృషి

ప్రజాశక్తి - బాపట్ల

సమాజ చైతన్యానికి రచయితలు, సాహితివేత్తల కృషి ప్రశంసనీయమని టిడిపి, జనసేన బాపట్ల అసెంబ్లీ అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సాహితీ విశ్లేషకులు, రచయిత, సాహిత్య రత్న వి రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన విరచిత గీతాంజలి తెలుగు అనువాద సాహితీ కర్త దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అనువదించిన గీతాంజలి కావ్య ఆవిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. విలువైన సాహిత్యాన్ని, రచనలను భావితరాలకు అందజేయాల్సిన ఆవశ్యకత నేటి సాహితీవేత్తలపై ఉందని అన్నారు. ఈ సందర్భంగా దమ్మాలపాటిని సన్మానించారు. సభలో సాహితీ వేత్త, చరిత్ర పరిశోధకులు, రంగస్థల నట ప్రయోక్త మన్నే శ్రీనివాసరావు, బసవమ్మ, వీర రాఘవయ్య, కొల్లా వీరయ్య చౌదరి, మధుమతి, గురవయ్య చౌదరి, దండమూడి ప్రభాకరరావు, విజయ రాఘవేంద్ర, దొప్పలపూడి రామ మోహనరావు, అంగలకుదురు సత్యనారాయణ, గొలపల శ్రీనివాసరావు, తానికొండ దయా బాబు, మందపాటి ఆంధ్రయ్య, ఫరీద్ మస్తాన్, కొల్లూరి వెంకటరావు, సురగాని శేఖర్, బూర్లె రామ సుబ్బారావు పాల్గొన్నారు.

దమ్మాలపాటిని సన్మానిస్తున్న నిర్వాహకులు

గుంటూరులో కాంగ్రెస్ బహిరంగ సభ

ప్రజాశక్తి - చీరాల

త్వరలో గుంటూరులో జరిగే కాంగ్రెస్ బహిరంగ సభను జయప్రదం చేయాలని డిసీసీ జనరల్ సెక్రెటరీ, సీనియర్ నాయకులు నీలం శ్యామేల్ మోజెస్ కోరారు. సీనియర్ సిటిజన్స్ ఆఫీసులో కాంగ్రెస్ నాయకులు విలే కరుల సమావేశం నిర్వహించారు. మాజీ కేంద్ర మంత్రి జెడీ శీలం, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గంట అంజిబాబు ఆదేశాల మేరకు పీసీసీ జనరల్ సెక్రెటరీ సయ్యద్ అలీం బాబు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ ఛైర్మన్ అంబటి పుష్పరాజ్, ఎస్సీ సెల్ జనరల్ సెక్రెటరీ మంకెన మణిబాబు, కరెద్దుల సురేష్, గుత్తి ధనుంజయరావు, కెవి ప్రసాద్, దామర్ల శ్రీనివాసరావు, మాచర్ల శ్రీనివాసరావు, దేవరకొండ కోటేశ్వరరావు, దేవరకొండ శ్రీనివాసరావు, యర్రాకుల శ్రీనివాసరావు, యనమల సూర్య ప్రదీప్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వినతి పత్రం అందిస్తున్న సింగరకొండపాలెం గిరిజనులు

ఇళ్లస్థలాల సమస్యపై వినతి

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని సింగరకొండపాలెం గిరిజనుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయంలో ఆర్ఐ శంకరరావుకు వినతి పత్రం అందజేశారు. గతంలో పేదలకు ఇచ్చిన పట్టాలను గ్రామానికి చెందిన పెత్తందారులు పేదలకి అందచేయకుండా ఆ పట్టాలు వారి వద్దే ఉంచుకొని మరోకరికి అమ్ముకొని సొమ్ము చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. అదేమని అడిగితే పోలీస్ కేసు పెట్టి జైలకు పంపిస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. విఆర్ఎలు పెత్తందారులకే సపోర్టుగా మాట్లాడుతున్నారని తెలిపారు. ఈ విషయంపై విచారించి పేదలకు న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొమరగిరి ప్రమేల, హనుమంతరావు, నాగరాజు, ఇల్లా సుబ్బులు, మల్లేశ్వరి, రమణమ్మ పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

తాగునీరు అందించాలని వినతి

ప్రజాశక్తి - రేపల్లె

మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో త్రాగునీరు లేక ప్రజలు, పశువులు ఇబ్బందులు పడుతున్నారని కమతం శివ సుబ్రహ్మణ్యం ఆర్‌డిఒ కార్యాలయ పరిపాలన అధికారి పద్మవతికి వినతి పత్రం సోమవారం అందజేశారు. స్పందనలో తీర ప్రాంత గ్రామాల ప్రజలు కలిసి సమస్య వివరించారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని తీర ప్రాంత గ్రామాలకు మంచినీరు విడుదల చేయాలని కోరారు. కాలువల నుండి నీరు విడుదల కాక, వర్షాబావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటడంతో సగానికిపైగా గ్రామాల ప్రజలు నీటి సమస్యతో అల్లాడుతున్నారని తెలిపారు. తాగునీటి కోసం పనులు వదిలి పెట్టుకుని కాపలా కాయాల్సి వస్తుందని వాపోయారు. త్రాగునీటి ఎద్దడికి తోడు ఎండలు మండుతుండటంతో పశువులు సైతం తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి తీర ప్రాంత దిగువ గ్రామాలకు త్రాగునీరు అందించే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరారు.

సమావేశంలో తునుగుంట్లా సాయిబాబా

వైసీపీ పాలనకు చరమగీతం పాడాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వైసిపి పాలనకు చరమగీతం పాడాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయి బాబా కోరారు. స్థానిక వాసవి దేవస్థానంలో టిడిపి కార్యకర్తల సమావేశం నిర్వహిం చారు. సిఎం వైఎస్ జగన్ ఎలాంటి అభివృద్ధి చేయకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. అవినీతి, మాఫియా తో పాలన కొనసాగించారని అన్నారు. హామీలు అమలు చేయకుండానే అమలు చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బట్టు మల్లికార్జునరావు, వై కరణ శ్రీనివాసరావు, ఎడ్ల జయ శీలరావు, కనపర్తి సుందరరావు, జంగం సాంసంన్, ఆతిన బసవ పున్నయ్య పాల్గొన్నారు.

ఇవే నాకు చివరి ఎన్నికలు

- అందరి దయతో గెలిస్తే మంచి టౌన్‌షిప్‌లు ఏర్పాటుచేస్తా..
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వెల్లడి
- పలు డివిజన్‌లలో ఇళ్ల పట్టాలు అందజేత

కొత్త బట్టలతో పాటు ఇంటి పట్టా అందజేస్తున్న బాలినేని

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

రాబోయే ఎన్నికలే తనకు చివరి ఎన్నికలని, అందరి దయతో గెలిస్తే ఒంగోలు నగరంలో రెండు చోట్ల రానున్న ఏడెనిమిది నెలల్లోనే మంచి సుందరమైన టౌన్‌షిప్‌లు ఏర్పాటుచేస్తానని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. నగరంలోని తొమ్మిది, మూడు, ఐదు, 11, 13వ డివిజన్‌లో పేదలకు మంజూరైన ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ కాగితాలను సోమవారం ఆయన అందజేశారు. లబ్ధిదారులైన దంపతులకు కొత్త బట్టలు పెట్టి.. పట్టా కాగితం చేతికిచ్చారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్‌లలో ఏర్పాటుచేసిన సభల్లో బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికలే తనకు చివరి ఎన్నికలని ప్రకటించారు. తనను ఆదరిస్తే ఎన్.అగ్రహారం, వెంగముక్కపాలెం వద్ద అన్ని సదుపాయాలతో సుందరమైన టౌన్‌షిప్‌లు నిర్మిస్తానని చెప్పారు. నగరంలో ఇంకా ఎవరైనా అర్హులకు ఇళ్ల పట్టాలు రాకపోతే వారిని కూడా విచారించి ఇళ్ల పట్టాలు ఇస్తామన్నారు. మరో నాలుగు వేల మందికి పట్టాలు ఇచ్చేందుకు అవకాశం ఉందని, భూమి కూడా అందుబాటులో ఉందని తెలిపారు. భరోసా పత్రాలు ఉండి స్థలాలు రాని వారు కొంతమంది ఉన్నారని, వారికి కూడా పట్టాలిస్తామని చెప్పారు. ఒంగోలులో పూరిగుడిసె అనేది ఉండకూడదనేదే తమ కోరిక అని చెప్పారు. తాను లేకపోయినా తన గురించి అందరూ చెప్పుకునేలా చేయాలనే సంకల్పంతోనే తాను పెద్ద ఎత్తున ఇళ్ల పట్టాలు పంపిణీకి శ్రీకారం చుట్టానని చెప్పారు. పట్టాలు పొందిన వారికి హద్దులు చూపించడం జరుగుతోందని, అందరూ ఇళ్లు కట్టుకోవాలని కోరారు. ఎవరైనా ఇళ్లు కట్టుకోలేకపోతే ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇస్తుందని తెలిపారు. తాము అందజేస్తున్న ఇంటి విలువ రూ.10 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమాలలో బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి శచిదేవి, నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం జస్వంతరావు, ఎఎంసి చైర్మన్ కొటారి రామచంద్రరరావు, వైసిపి నగర అధ్యక్షులు కటారి శంకర్, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిన జగన్

ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్

మాట్లాడుతున్న జంగా గౌతమ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిన జగన్మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఓడించాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో జంగా గౌతమ్ మాట్లాడారు. జగన్ పాలనలో రాష్ట్ర అప్పు సుమారు రూ.11 లక్షల కోట్లకు చేరిందని, రోజుకు సరాసరి రూ.300 కోట్లు అప్పు చేస్తుందని విమర్శించారు. బటన్ నొక్కి.. డబ్బులు ఇస్తున్నానని చెబుతున్న జగన్ ఎంత అప్పులు చేశాడో ప్రజలకి చెప్పకుండా మోసం చేస్తున్నారన్నారు. ప్రత్యేక హోదాతో రాష్ట్రం అభివద్ధి చెందుతుందని, కాంగ్రెస్ పార్టీ ద్వారానే హోదా సాధ్యమవుతుందన్నారు. ఇందు కోసమే రాష్ట్రానికి పదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తామని కాంగ్రెస్ ప్రజలకు హామీ ఇస్తుందన్నారు. వైసిపి, టిడిపి, జనసేనలు బిజెపికి తొత్తులుగా మారాయని, కాంగ్రెస్ పార్టీ మాత్రమే రాష్ట్రానికి ప్రత్యామ్నాయమని జంగా గౌతమ్ తెలిపారు.

గుంటూరు సభ వాయిదా

ఈ నెల ఏడో తేదీన గుంటూరులో తల పెట్టిన సభ శివరాత్రి పండుగ కారణంగా వాయిదా వేసినట్లు గౌతమ్ చెప్పారు. రాజధాని ప్రాంతంలో భారీ బహిరంగ సభలు కాంగ్రెస్ జరిపి రాష్ట్ర పరిస్థితిని ప్రజలకు తెలియజేస్తామని త్వరలోనే ఆ తేదీ చెబుతామన్నారు. సమావేశంలో పిసిసి ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాష్, కొరివి వినయ్ కుమార్, రాష్ట్ర ఎస్‌సి సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉద్దండి మల్లికార్జున రావు, ప్రధాన కార్యదర్శులు షేక్ సైదా, కొండా రెడ్డి, మైనార్టీ విభాగం రాష్ట్ర కో చైర్మెన్ చంద్రపాల్, పిసిసి సభ్యులు నాగేశ్వరరావు, నగర అధ్యక్షురాలు నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలి

కలెక్టర్ రంజిత్‌బాషా

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. ఎంసిసి కమిటీలోని అధికారులకు సోమవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి రాగానే అధికారులు అప్రమత్తం కావాలని చెప్పారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి మండల స్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత ఎంసిసి కమిటీపై ఉందన్నారు. అధికారిక సమావేశాలు నిర్వహించరాదని, ఏదైనా ప్రారంభించే కార్యక్రమాలకు నిషేధం వర్తిస్తుందన్నారు. ఎన్నికలలో పోటీ చేసే పార్టీలు, ఆయా అభ్యర్థులకు సమాన అవకాశాలు ఎన్నికల కమిషన్ కల్పిస్తుందన్నారు. అభ్యర్థుల ప్రచారాలు, సభలు, సమావేశాలపై నిశిత పరిశీలన, నిఘా ఉంచాలన్నారు. ఆ పార్టీలు వెచ్చిస్తున్న వాటిని, అభ్యర్థుల ఖర్చులను ఎప్పటికప్పుడు పరిశీలించి నమోదు చేయాలన్నారు. విభిన్న రీతిలో ప్రచారాలు ఉంటాయని వాటిని గుర్తించాలన్నారు. ముఖ్యంగా నగదు, వస్తువులు, ఇతర బహుమతులతో ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందన్నారు. కులమతాలతో పలువురిని ప్రభావితం చేయడం నిబంధనలను ఉల్లంఘించడమేనన్నారు. ఆధ్యాత్మిక ప్రార్థన మందిరాలలో అభ్యర్థులు సమావేశాలు నిర్వహించరాదన్నారు. ఇలాంటి వాటితో ప్రజలను ప్రలోభ పెట్టే అంశాలపై అధికారులు ప్రత్యేక దష్టి సారించాలన్నారు. నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత ఎంసిసి అధికారులపై ఉందన్నారు. మండల స్థాయిలోని ఇతర కమిటీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని ఆయన పలు సూచనలు చేశారు. ముందుగా జిల్లా ప్రణాళిక అధికారి కె శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్యలు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, ఏఎస్పీ పి.మహేష్, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

వికలాంగురాలి వద్దకెళ్లి.. అర్జీ స్వీకరించి..

వికలాంగురాలి సమస్య వింటున్న ఎస్‌పి వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

స్పందన కార్యక్రమానికి వచ్చిన వికలాంగురాలి వద్దకు ఎస్పీ వకుల్ జిందాల్ స్వయంగా వెళ్లారు. ఆమె సమస్యను అడిగి తెలుసుకున్నారు. వేగవంతంగా విచారణ చేసి ఆమె సమస్యను పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి స్పందన కార్యక్రమంకు వచ్చిన ప్రజల యొక్క సమస్యల అర్జీలను ఎస్పీ స్వయంగా స్వీకరించారు. చీరాల మండలం పిట్టువానిపాలెం గ్రామానికి చెందిన పిట్టు మల్లేశ్వరి పుట్టుకతోనే వికలాంగురాలు. తల్లిదండ్రులు చనిపోవడంతో ప్రభుత్వం ఇచ్చే పించనుపై ఆధారపడి జీవనం సాగిస్తుంది. ఆమె తన సమస్యను జిల్లా ఎస్పీకి విన్నవించుకోవడానికి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి వచ్చింది. వికలాంగురాలు అవ్వడం వలన ఆమె పడుతున్న ఇబ్బందిని తెలుసుకున్న జిల్లా ఎస్పీ స్వయంగా ఆమె వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించి, ఆమె సమస్యను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి వేగవంతంగా చట్టపరిధిలో విచారణ జరిపి ఆమె సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

రాజకీయ పార్టీల ప్రలోభాలపై ఎన్నికల కమిషన్ స్పందించాలి

సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

మాట్లాడుతున్న వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ లోని వివిధ రకాలైన ప్రలోభాలతో రాజకీయ పార్టీలు వేగంగా ప్రభావితం చేస్తున్నాయని వీటిపై ఎన్నికల కమిషన్ తక్షణమే స్పందించి నివారించి. కఠిన చర్యలు తీసుకోవాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు. ఒంగోలులోని రంగా భవన్‌లో 'ఓటేద్దాం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం' అనే అంశంపై కళాజాత కార్యక్రమం సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ ఓటర్లకు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉన్న వాలంటీర్లను లోబరుచుకోవటానికి ప్రత్యేక కానుకలు, పారితోషికాలు, చీరలు వంటివి ఎర చూపి రానున్న ఎన్నికల్లో ఓటర్లతో ఓటు వేయించే బాధ్యత అప్పజెప్పుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ మౌనంగా ఉండటంతో ఎన్నికల వ్యవస్థపై ప్రజలలో నమ్మకం సన్నగిల్లుతుందన్నారు. వాలంటీర్లను ఎన్నికల విధుల్లో ఉంచరాదని కేంద్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను తుంగలో తొక్కుతూ ధిక్కార స్వరాన్ని వినిపిస్తున్న ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో తిరుపతిలో జరిగిన ఉప ఎన్నికల్లో దొంగఓట్ల బాగోతాన్ని ఎలాగైతే నడిపారో రానున్న ఎన్నికలలో మరిన్ని నియోజక వర్గాలలో అదే పంథాను అమలు చేయటానికి అధికార పార్టీ సంసిద్ధమవుతుందన్నారు. ప్రతి ఓటరు తన ఓటును కాపాడుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. దొంగ ఓట్లను నివారించడానికి అందరం కృషి చేయాలని కోరారు. పట్టణ ప్రాంత ఓటర్లు ఓటింగ్ పట్ల నిరాశక్తతతో ఉండడంతో ఓటింగ్ శాతం తక్కువగా ఉందని, ఆట, పాట, మాటలతో కళారూపాల ద్వారా నగర ప్రజలను జాగతులను చేస్తున్నామన్నారు. ఎన్నికల నిఘా వేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ మాగులూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఓటరు ప్రలోభాలకు లోను కాకుండా ఓటింగ్ లో పాల్గొని నిస్వార్థపరులను గెలిపించుకుంటేనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివద్ధి వైపు పురోగమిస్తుందన్నారు. అర్హులైన వాళ్లు, ఇప్పటికీ ఓట్లు పొందలేని వారు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు, నామినేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు ఓటర్లుగా నమోదు కావచ్చన్నారు. విద్యార్థులు ఓటింగ్ అంబాసిడర్లుగా మారి ఓటింగ్ శాతం పెంపుదలకు కషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్‌జి రంగా కిసాన్ సంస్థ అధ్యక్షులు ఆళ్ళ వెంకటేశ్వరరావు, ఒంగోలు పట్టణ అభివద్ధి సంస్థ అధ్యక్షులు కొల్లా మధు, విశ్రాంత అదనపు ఎస్‌పి సుంకర సాయిబాబు, విద్యార్థులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 71 ఫిర్యాదులు

ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కోసం సోమవారం 'స్పందన' కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రకాశం జిల్లా ఎస్పీ పి.పరమేశ్వర రెడ్డి ఐ.పి.యస్ గారి ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (క్రైమ్) శ్రీధర్‌రావు, పోలీసు అధికారులు నిర్వహించారు. జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను పోలీస్ అధికారులు స్వీకరించి, వారితో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యల పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. వాటిని చట్టపరిధిలో పరిష్కరిస్తామని ఫిర్యాదిదారులకు భరోసా కల్పించారు. అందిన ఆయా ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

స్పందనలో వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

– ఫ్లిప్కార్ట్ లక్కీ డ్రా లో మీ పేరు వచ్చిందని, రూ.15 లక్షలు గెలుచుకున్నారని నమ్మించి, అవి రావాలంటే ముందుగా 1 శాతం అనగా 15 వేలు కంపెనీకి ట్రాన్సుర్ చేయాలని బదిలీ చేయించుకున్నారని, తర్వాత లక్కీ డ్రా డబ్బులు బ్యాంకు ట్రాన్సుర్ అయ్యాయని ఐటి రిటర్న్లు క్రింద రూ.32 వేలు కట్టించుకొని, మళ్లీ జీఎస్టీ కింద రూ.60 వేలు కట్టాలని లేకుంటే ముందు చెల్లించిన డబ్బులు రావని బెదిరిస్తూ.. తనని సైబర్ కేటుగాళు మోసం చేశారని కనిగిరి మండలంకు చెందిన ఓ బాధితుడు ఫిర్యాదు చేశారు.

– డిగ్రీ చదివి ఉద్యోగ ప్రయత్నం చేస్తున్న తనకు పల్నాడు జిల్లా ఈపురు మండలానికి చెందిన చింత సతీష్ పరిచయమై సాఫ్ట్వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.4.50 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించుకొని.. మోసం చేశాడని దొనకొండ మండలం చెందిన ఒక యువకుడు ఫిర్యాదు చేశారు.

స్పందన కార్యక్రమంలో ఒంగోలు డిఎస్పీ యం.కిషోర్‌బాబు, దిశ డిఎస్పీ శ్రీనివాసరావు, ట్రాఫిక్ డిఎస్పీ శ్రీనివాసరావు, ప్యానెల్ అడ్వకేట్ బివి.శివరామకృష్ణ పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో వీల్‌చైర్స్ బహూకరణ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యశాలకు రేపల్లె రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా 11వీల్ చైర్లను అందజేశారు. వైసిపి ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జున రావు చేతుల మీదగా అప్పగించారు. రోటరీ చైర్మన్ మాదాల మోహన్లాల్ సక్సేనా అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా అశోక్ బాబు మాట్లాడుతూ అన్నిటికంటే ఉత్తమమైనది సేవ చేసే భాగ్యం దొరకటమేనని అన్నారు. రోటరీ క్లబ్ 1905లో ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. సేవ చేయటం అనేది ఒక వ్యసనంగా భావించాల్సి ఉందని అన్నారు. ఇప్పటి వరకు రోటరీ క్లబ్ ద్వారా రూ.1400కోట్ల విలువైన సేవా కార్యక్రమాలకు చేయడం అభినందనీయమని అన్నారు. క్లబ్బులో సభ్యులుగా చేర్పి తద్వారా ప్రతినెల రూ.500 నుండి రూ.వెయ్యి వరకు సహాయం చేస్తే మరింత సేవ చేయడానికి దోహద పడతాయని అశోక్ బాబు సూచించారు. తాను 14ఏళ్ల పాటు బ్రేక్ ఇన్స్పెక్టర్‌గా పని చేస్తూ రోటరీ సభ్యునిగా ఉన్నానని తెలిపారు. బ్రేక్ ఇన్స్పెక్టర్‌గా వాహనాలకు ఎంతో కొంత అపరాధ రుసుం రాయాల్సి ఉంటుందని అన్నారు. దీని కారణంగా సేవ చేసే భాగ్యానికి దూరమైనట్లు పేర్కొన్నారు. సేవా దృక్పథంతో పనిచేసే తనకు ఆ ఉద్యోగం సరైనది కాదని భావించి ఉద్యోగ విరమణ చేసినట్లు తెలిపారు. రాజకీయాల్లో ఉంటే ప్రజలకు సేవ చేయవచ్చని తెలిపారు. పదిమందికి సేవ చేయటం ద్వారానే ఆరోగ్యవంతంగా, మానసిక ఉల్లాసంగా, బ్రతకటానికి అవకాశం లభిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని కోరారు. అనంతరం డాక్టర్ సిహెచ్ రామలక్ష్మికి వీల్‌చైర్లను అప్పగించారు. కార్యక్రమంలో ఎంపిపి డివి లలితకుమారి, జడ్పిటిసి టి ఉదయ్ భాస్కరి, సర్పంచ్ దారా రవి కిరణ్మయి, మండల ఉపాధ్యక్షులు కె పిచ్చయ్యశాస్త్రి, ఎంపిటిసి కొతరపు పద్మావతి, రోటరీ క్లబ్ సభ్యులు గొట్టుముక్కల బాపారావు, యార్లగడ్డ బుచ్చిరావు, సాయి తేజ, గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాస రావు, బాలాజీ మల్లేశ్వరరావు, మోర్ల సత్యనారాయణ, మొర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వీల్ చైర్లు బహుకస్తున్న అశోక్ బాబు, దేవినేని

మహిళా దినోత్సవ సభలో ఐసిడిఎస్ సూపర్వైజర్ అన్నపూర్ణ

దేవరపల్లిలో మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని దేవరపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ముందస్తు మహిళా దినోత్సవం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం అన్నపూర్ణ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండాలని అన్నారు. దిశ యాప్ ప్రాముఖ్యత, మహిళలకు ఏదైనా ప్రమాదం, ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే దిశ కంట్రోల్ రూంకి, 100, 181,1091 ఉమెన్ హెల్ప్ లైన్ నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. మహిళలు తమని తాము రక్షించుకోవాల్సిందిగా కోరారు. గ్రామ మహిళా పోలీస్ వై ప్రసన్నవాణి మాట్లాడుతూ గ్రామంలో బాలికలకు కానీ, మహిళలకు కానీ ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే తమకు తెలియజేయాలని కోరారు. తద్వారా వారి సమస్యలు పరిష్కరించి తగిన తక్షణం రక్షణ సహాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పాల్గొన్నారు.

సహాయం చేస్తున్న యడం చినరోశయ్య ట్రస్ట్ ప్రతినిధులు

పేదలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పర్చూరు

వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జి యడం బాలాజీ తన తండ్రి యడం చిన రోశయ్య ట్రస్ట్ నిధుల నుండి తన సోదరుడు లక్ష్మి దీపక్ పర్యవేక్షణలో మార్టూరు మండలం తాటివారిపాలెం గ్రామానికి చెందిన మూడుముల బైరాగి, కోలలపూడి గ్రామానికి చెందిన సురగాని సుబ్బారావు, కొనంకి గ్రామానికి చెందిన మరో వ్యక్తి కుటుంబానికి, పర్చూరు ఇందిరాకాలనీకి చెందిన చేకూరి సుబ్బలక్ష్మి కుటుంబసభ్యులకు, చిన్నగంజాం మండలం అంబేద్కర్ నగర్ మేడికొండ ప్రభాకర్ కుటుంబసభ్యులకు, మేడికొండ సంగీతరావు కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం ఒక్కో కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. అదే విధంగా చెరుకూరు గ్రామం ఉప్పరపాలెంకు చెందిన మిండాల వెంకటేష్ కుటుంబానికి రూ.25వేల ఆర్థిక సహాయం అందజేశారు.

బీసీల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- మార్టూరు రూరల్

ఎంఎల్‌ఎ ఏలూరి సాంబశివరావు

బీసీల అభివృద్ధికి టిడిపి కృషి చేస్తుందని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు అన్నారు. టీడీపీ బీసీ సాధికారత కమిటీ ఆధ్వర్యంలో నేడు గుంటూరులో జరిగే జయహో బీసీ సభకు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. బీసీ సబ్ ప్లాన్ నిధులను సీఎం జగన్ దారిమళ్లించారని ఆరోపించారు. బీసీల అభివృద్ధికి, బీసీల నిధులపై తాము డిక్లరేషన్ ఇస్తున్నట్లు తెలిపారు. టిడిపి అధినేత చంద్రబాబు అధికారానికి వస్తే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తామని పేర్కొన్నారు. బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా టిడిపి బీసీ డిక్లరేషన్ ప్రకటించినట్లు తెలిపారు. వైసిపి పాలనలో బీసీలు మోసపోయారని అన్నారు. బిసిల సంక్షేమం, అభివృద్ధి టిడిపిని ఆదరించాలని కోరారు. టిడిపి అమలు చేసిన పథకాలను గుర్తు చేశారు. నేడు గుంటూరు సమీపంలోని నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా జరిగే భారీ సభకు బీసీ సోదరులు తరలి రావాలని కోరారు.

తహశీల్దార్ మునిలక్ష్మికి ఎంపిపి అభినందనలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

నూతన తహశీల్దారుగా బాధ్యతలు చేపట్టిన ఐ మునిలక్ష్మిని ఎంపిపి డివి లలితకుమారి, ఉపాధ్యక్షులు కె పిచ్చయ్య శాస్త్రి అభినందించారు. తహశీల్దార్లుగా గత నెల రోజుల్లో ముగ్గురిని మార్చడం పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, ఎన్నికలు సమీపిస్తుండటతో అధికారులు అనేక అంశాలను పరిశీలించుకోవాల్సి ఉన్న దృష్ట్యా ప్రభుత్వం అధికారులను ఎన్నికల అయ్యేవరకు కొనసాగిస్తే అందరికీ ఆమోదయగ్యంగా ఉంటుందని ఎంపిపి సూచించారు. మునిలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాలు అమలు చేస్తున్న అంశాలను తప్పకుండా ప్రజల వద్దకు తీసుకువెళ్లి 10సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తనకు తోడ్పాటును అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వైసిపి నాయకులు మల్లేశ్వరరావు, దున్న మధు పాల్గొన్నారు.

తహశీల్దారు మునిలక్ష్మిని అభినందిస్తున్న ఎంపిపి

సచివాలయాన్ని తాకట్టు పెట్టడం సిగ్గుచేటు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మాట్లాడుతున్న వేల్పూరు శ్రీనివాసరావు

ఆంధ్ర రాష్ట్ర పరిపాలనకు వేదికగా ఉన్న ఆంధ్ర సచివాలయాన్ని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కేవలం రూ.370కోట్లకు తాకట్టు పెట్టడం సిగ్గుచేటని, దీని దృష్ట్యా రాష్ట్రంలో ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించాలని కాపు ఉద్యమ నేత వేల్పూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానికంగా సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్ రూ.2.80కోట్లు ఉండగా కేవలం రూ.370కోట్లకు తాకట్టు పెట్టడం ఐదు కోట్ల ఆంధ్ర ప్రజల ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెట్టడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. దృష్ట్యా తక్షణమే ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించాలని కోరారు.

టిడిపి మేనిఫెస్టో ప్రచారం చేస్తున్న అనగాని

కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి -రేపల్లె

టిడిపి, జనసేన సంయుక్తంగా రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలతో భావితరాలకు భవిష్యత్తు లభిస్తుందని టిడిపి నాయకులు అనగాని శివప్రసాద్ అన్నారు. బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని పట్టణంలోని 13వ వార్డులో సోమవారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు జిపి రామారావు, జీవి నాగేశ్వరరావు, వెనిగళ్ల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులు పంపిణీ

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని బుర్ల వారిపాలెంలో సోమవారం దూడలకు నట్టల నివారణ మందుల పంపిణీ చేశారు. జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ అధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆర్థిక వనరులతో గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం సోమవారం నిర్వహించారు. పశు గణాభివృద్ధి సంస్థ చైర్మన్ కోసూరి రాధ మాట్లాడారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చిన పశు వైద్యులను సంప్రదించాలని అన్నారు. శిబిరంలో 37గర్భ కోశ వ్యాధుల చికిత్స, 91దూడలకు నట్టల నివారణ మందులు, ఖనిజ లవణ మిశ్రమం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పశు వైద్య అధికారి డాక్టర్ మద్దు హనుమంతరావు, డాక్టర్ ఎస్‌కె కాలేషా, ఈఒ డిఎల్ డిఏ ఏరియా పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సజ్జ చిట్టి బాబు, పశు వైద్య అధికారులు డాక్టర్ తాటిపర్తి శివారెడ్డి, డాక్టర్ రవికుమార్, డాక్టర్ దేవరపల్లి ఆనంద భాగ్య రాజు పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

విద్యార్థులను అభినందిస్తున్న డిఇఒ నారాయణరావు

ప్రజాశక్తి - చీరాల

వ్యవస్థాపక మనస్తత్వం పెంపొందించుకోవడం వలన పారిశ్రామికవేత్తగా ఎదగవచ్చని డిఇఒ కె నారాయణరావు అన్నారు. పట్టణంలోని ఎబిఎం ఉన్నత పాఠశాల్లో సోమవారం నిర్వహించిన ఎంటర్ ప్రెన్యూరియల్ మైండ్ సెట్ డెవలప్మెంట్ ఈఎండిపి జిల్లా స్థాయి ప్రాజెక్టు ప్రదర్శనకు ఆయన సోమవారం హాజరయ్యారు. విద్యార్థులు వ్యవస్థాపక ఆలోచనలు కలిగి ఉండాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 11 పాఠశాలల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ఎక్స్‌పోలో ప్రదర్శించారు. వాటిలో రెండు ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. జె పంగులూరు మండలం బూదవాడ జెడ్పి ఉన్నత పాఠశాలకు చెందిన దివ్య, షేక్ సమీరా రూపొందించిన ప్రొడక్షన్ ఆఫ్ మోడరన్‌కీ చైన్స్ అండ్ డాలర్స్ మొదటి బహుమతి పురస్కారం అందుకోగా, ఇంకొల్లులోని ఎన్ఆర్ఎవిఎస్ఆర్ ఉన్నత పాఠశాలకు చెందిన జి శృతి, వై ఇందిరా రూపొందించిన (మొరింగకారం) మునగాకు కారం ప్రాజెక్టు ద్వితీయ బహుమతిని సాధించుకుంది. విద్యార్థులు ఈనెల 6న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు హాజరు కావాలని జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్ సూచించారు. జిల్లా స్థాయి విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. న్యాయ నిర్ణేతగా విశ్రాంత ప్రిన్సిపాల్ కెవి రామగోపాలశర్మ వ్యవహరించారు. బాపట్ల డిప్యూటీ డిఇఒ జి వెంకటేశ్వర్లు, బాపట్ల ఎంఈఓ డి ప్రసాదరావు, ఈఎండిపి జిల్లా మేనేజర్ జె భానుకిరణ్, అధికారి మహమ్మద్ సాదిక్, జిల్లా కౌశల్, కో ఆర్డినేటర్ పవని భానుచంద్ర మూర్తి, సికిందర్ మీర్జాన్ పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : బాపట్లలో జరిగిన ప్రన్యూరియల్ మైండ్ సెట్ డెవలప్మెంట్ జిల్లా స్థాయి ప్రాజెక్టు ప్రదర్శనకు జిల్లా వ్యాప్తంగా రూపొందించిన ప్రాజెక్టుల ప్రదర్శనలో రెండు ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఎన్ఆర్‌వి ఎస్ఆర్ ఉన్నత పాఠశాలకు చెందిన జి శృతి, వై ఇందిరా రూపొందించిన "మొరింగకారం" (మునగాకు కారం) ప్రాజెక్టు ద్వితీయ బహుమతిని గెల్చుకుంది. ఈఎండిపి జిల్లా మేనేజర్ జె భానుకిరణ్, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్, జిల్లా కౌశల్ కో ఆర్డినేటర్ పవని భానుచంద్ర మూర్తి, సికిందర్ మీర్జాన్ పాల్గొన్నారు.

నిజాంపట్నం : జివిఎస్ స్వామినాథన్ సైన్స్ డే టాలెంట్ టెస్ట్‌ను ఈ ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ఆన్లైన్‌లో 6నుండి 9వ తరగతి వరకు నిర్వహించారు. ఈ ప్రతిభా పరీక్షల్లో మండలాల వారీగా విజేతలను ప్రకటించారు. ఫలితాల్లో జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. పాఠశాల హెచ్ఎం పాలపర్తి శివన్నారాయణ విద్యార్థులను అభినందించి ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. సీనియర్స్ విభాగంలో 9వ తరగతి విద్యార్థిని కొలగాని సాయి శ్రీజ, జూనియర్స్ విభాగంలో మన్నెం లక్ష్మీధర్ విజయం సాధించినట్లు తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు బి ప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు టి రామకృష్ణ, వి శ్రీనివాసరావు, శివ సుబ్రమణ్యం, ప్రభావతి పాల్గొన్నారు.

ద్వితీయ బహుమతి అందుకుంటున్న ఇంకొల్లు విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మూతపడ్డ ఆయుర్వేద వైద్యశాల

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల కేంద్రమైన భట్టిప్రోలులో 60ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల పది రోజులుగా మూసివేతకు గురైంది. ప్రాథమిక వైద్యశాల వ్యవస్థ రాకముందు ఈ వైద్యశాల నుండే ప్రజలకు వివిధ రకాల వైద్య సేవలు అందేవి. కానీ ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఈ వైద్యశాల్లో ఖాళీ అవుతున్న పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఉన్నవారు పదవి విరమణ చేయటం వంటి కారణాలతో నేడు ఏ ఒక్కరు లేకపోవడంతో మూసివేతకు గురైంది. ఎన్నో ఏళ్లుగా ఆయుర్వేద వైద్యానికి అలవాటు పడిన అనేక మంది ఈ వైద్యశాల్లోనే చికిత్స పొందుతూ ఉంటారు. ఈ వైద్యశాల్లో సింగరాచార్యులుగా పనిచేసిన వైద్యులు వైద్యశాలకు ప్రత్యేక గుర్తింపు సాధించారు. నిరంతరం ప్రజలతో మమేకమై వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందించడంతో ఆయుర్వేద వైద్యశాలకు ప్రత్యేక గుర్తింపు ఉండేది. ఆయన బదిలీ అనంతరం ఇక్కడ సరైన వైద్యులు రాకపోవడంతో ఉన్న వైద్య సిబ్బంది, నర్సులు, దూర ప్రాంతాల నుండి డిప్యూటేషన్‌పై ఉన్న వైద్యులు అరకొరగా చికిత్సలు అందిస్తూ కాలయాపన చేస్తూ ఉన్నారు. అయినప్పటికీ ప్రజలు ఏదో సమయంలో వైద్యశాలకు వెళ్లి అవసరమైన చర్మవ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులకు మందులు పొందుతూ ఉండేవారు. నర్సులు, సిబ్బంది కూడా బదలీలు కావటంతో చివరికి ఒక కాంపౌండర్ మాత్రమే మిగిలారు. ఆయన కూడా ఇటీవల పది రోజుల క్రితం వరకు పనిచేసి వేరే వైద్యశాలకు బదిలీ కావడతో ఈ వైద్యశాలకు తాళాలు తీసేవారు కూడా లేక మూత పడిపోయింది. ఇదిలా ఉండగా గత కొన్ని నెలల క్రితం ఆయుష్ శాఖ వైద్య బృందం ఈ వైద్యశాలను పరిశీలించింది. దీనిని అభివృద్ధి పరిచి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. దీనిలో యోగా కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. ప్రజలకు సేవలు అందించేందుకు దోహదపడే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కానీ ప్రస్తుతం వారు చేసిన సూచనలు కూడా ఎక్కడ అమలు జరగకపోగా మూత దశకు చేరుకోవటం గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి ఆయుర్వేద వైద్యశాల్లో సిబ్బందిని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

భట్టిప్రోలు ఆయుర్వేద వైద్యశాల

ఎంపి సురేష్‌ను అభినందిస్తున్న కరణం బలరాం

సిద్ధం సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - చీరాల

సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 10న మేదరమెట్ల హైవేలో ఏర్పాటు చేసిన సిద్ధం సభను వైసిపి నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని తాజా మాజీ ఎంఎల్‌ఎ కరణం బలరామకృష్ణమూర్తి కోరారు. రామకృష్ణాపురంలోని వైసీపీ క్యాంపు కార్యాలయంలో బూత్ కమిటీలతో సిద్ధం సభ సమీక్షా సమావేశం వైసిపి ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. సమావేశంలో ఎంపి నందిగం సురేష్ మాట్లాడుతూ పేదల సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందాలంటే వైసీపీ మరోసారి అధికారంలోకి తీసుకోని వచ్చి జగన్మోహన్ రెడ్డిని మరలా సిఎంగా గెలిపించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, వైసిపి మండల అధ్యక్షులు ఆసాది అంకాలరెడ్డి, బొడ్డు సుబ్బారావు, రామన్నపేట సర్పంచ్ కందేటి రమణ, రాష్ట్ర డైరెక్టర్లు గవిని శ్రీనివాసరావు, మల్లీ వైష్టవి, మల్లెల లలిత రాజశేఖర్, యాతం మేరీ బాబు, గోలి గంగాధర్, జిల్లా కార్యదర్శిలు శిఖా సురేష్, రొండా భరత్, బండారు శివ పార్వతి, సల్లూరీ అనిల్, చీమకుర్తి బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆడిటోరియానికి నిధులివ్వండి

ప్రిన్సిపల్ సెక్రటరీని కోరిన బిళ్లా చెన్నయ్య

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రిన్సిపల్ సెక్రటరీ హర్షవర్ధన్‌తో మాల మహానాడు అధ్యక్షులు చెన్నయ్య

ఒంగోలు అంబేద్కర్ ఆడిటోరియం మంజూరుకు జీఓ ఇవ్వాలని సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హర్ష వర్ధన్‌ను మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బిళ్ళా చెన్నయ్య కోరారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో హర్షవర్ధన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిళ్ళా చెన్నయ్య మాట్లాడుతూ ఇటీవల ఒంగోలులో జరిగిన సిఎం పర్యటనలో అంబేద్కర్ ఆడిటోరియానికి నిధులు మంజూరు చేయాలని కోరటంలో ఇస్తామని సిఎం హామీ ఇచ్చారన్నారు. త్వరగా జీఓ విడుదల చేయాలని కోరారు. స్పందించిన ప్రిన్సిపల్ సెక్రటరీ త్వరలో జీఓ ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తుల వెంకటరావు. లింగంగుంట కార్తీక్, కె వీరబ్రహ్మయ్య. మాలమహానాడు కార్యకర్తలు పాల్గొన్నారు

ఎఐ ఎడ్యుకేషన్ రీచ్ ఛాంపియన్ అవార్డు

ప్రజాశక్తి - వేటపాలెం

సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీ ఎఐ ఎడ్యుకేషన్ ఔట్ రీచ్ చాంఫియన్ అవార్డు కైవశం చేసుకున్నట్లు ళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సోమవారం తెలిపారు. భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్ మయం అవుతుందని టెక్ నిపుణులు చెబుతున్న క్రమంలో తమ కాలేజీ అవార్డును కైవసం చేసుకోవటం గర్వంగా ఉందని ప్రిన్సిపాల్ ఎం వేణు గోపాలరావు తెలిపారు. హైదరాబాద్‌లో సిఎంఆర్ టెక్నికల్ కంపెనీ నందు ఎఐఎంఇఆర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవార్డుల మహోత్సవంలో తమ కాలేజీ అవార్డును కైవసం చేసుకున్నది ఎఐఎంఎల్ విభాగాధిపతి సి హరికిషన్ తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ గతంలో ఉన్న సాఫ్ట్వేర్ ఇండస్ట్రీకి అడ్వాన్స్డ్ టెక్నాలజి వంటిదని అన్నారు. చాలమంది విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఒక కెరియర్ ఆప్షన్గా మారినదని అన్నారు. విద్యార్థుల ఆసక్తిని బట్టి మెషీన్ లెర్నింగ్ ఇంజినీర్‌గా, డేటా సైంటిస్టుగా, రోబోటిక్స్ ఇంజినీర్, ఎఐ రీసెర్చ్ సైంటిస్ట్‌గా, ఎఐ ఇంజినీర్‌గా స్థిరపడి కెరీర్ ప్రారంభం నుండే మంచి ప్యాకేజి అందుకోవచ్చని, ఎఐ డిగ్రి ఉన్న గ్రాడ్యుయేట్లు ప్రారంభం నుండి నెలకు రు.50వేల నుండి రు.లక్ష లేదా ఎడాదికి రు.15లక్షల వరకు సంపాదించవచ్చని తెలిపారు. రానున్నరోజుల్లో ఎఐ మంచి అవకాశాలను అందిస్తుందని అన్నారు. భవిష్యత్తును శాసిస్తున్న అడ్వాన్స్డు టెక్నాలజిలో భాగం కావలనుకున్న వారికి ఎఐ ఒక బెస్ట్ అప్షన్ అని తెలిపారు. భారత్‌లో పెరుగుతున్న ఎఐ బూమ్ ద్వారా యువతకు మంచి అవకాశాలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఒడి కె సుబ్బారావు, ఎస్ ఇంద్రనీల్, సి హరికిషన్, కె సుబ్బారావు, మేనేజర్ ఆర్‌వి రమణమూర్తి పాల్గొన్నారు.

అవార్డు చూపుతున్న సెక్రటరీ వనమ రామకృష్ణారావు

ఈవిఎం గోదాము పరిశీలన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరం మామిడిపాలెంలోని ఎన్నికల ఓటింగ్ యంత్రాలు భద్రపరచు గిడ్డంగిని కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఈవిఎంలను రానున్న ఎన్నికల్లో ఎలా ఉపయోగించాలో ఓటర్లకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. తహశీల్దార్లకు ఈవిఎంలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. పూర్తిస్థాయి భద్రత మధ్య అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివి ప్యాట్స్‌ను పంపిస్తున్నట్లు తెలిపారు. అందు కోసం ప్రత్యేక మొబైల్ వాహనాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడి నుంచి పంపిస్తున్న ఈ పరికరాలను ఈవిఎం మేనేజ్‌మెంట్ సిస్టంలో నమోదు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈవిఎం వివరాలతో పాటు, సీరియల్ నెంబర్లు కూడా రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఒక కాపీ ఇస్తున్నామని అన్నారు. ఈ అవగాహన కార్యక్రమం పూర్తయిన తరువాత తిరిగి ఈవిఎంలను గిడ్డంగి భవనానికి చేర్చమన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులు, వైసిపి ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, బిజెపి ప్రతినిధులు రాజశేఖర్, గుర్రం సత్యం, టిడిపి ప్రతినిధులు స్వరూప్, కాలేషాబేగ్, సిపిఎం ప్రతినిధి బి రఘురాం, కాంగ్రెస్ ప్రతినిధి రసూల్, తహశీల్దార్లు. ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఈవిఎంలు పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - చీరాల

టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారానికి రాగానే మత్స్యకారుల సమస్యలు పరిష్కారం చేస్తుందని టిడిపి ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. మండలంలోని వాడరేవు గ్రామంలో మత్స్యకారులతో సమావేశమయ్యారు. టిడిపి ఇంచార్జ్ మద్దులూరి మాలకొండయ్య ప్రత్యక్షంగా సముద్రంలోకి వెళ్లి మత్స్యకారుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. టిడిపి ప్రభుత్వంలో మత్స్యకారులకు వలలు, బోట్లు, లైఫ్‌జాకెట్లు, దిక్సూచి వంటి పరికరాలను రాయితీపై అందజేసినట్లు తెలిపారు.

బోటులో ప్రయాణం చేస్తున్న టిడిపి ఇన్‌ఛార్జి కొండయ్య

అట్రాసిటీ కేసు కొట్టివేత

ప్రజాశక్తి - భట్టిప్రోలు

తూనుగుంట్ల సాయి బాబా

భట్టిప్రోలు ఉపసర్పంచి, పాలకవర్గ సభ్యులైన దుఃఖ పోతురాజు, కొన్నిపాటి లోకానంద్ పై 2017లో అప్పటి సర్పంచి కంభం మరియమ్మ పెట్టిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుంటూరు జిల్లా సెషన్స్ కోర్టు కొట్టివేసినట్లు నిందితుడిగా ఉన్న తూనుగుంట్ల సాయి బాబా తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2017మార్చిలో సర్పంచ్ కంభం మరియమ్మ తనను కుల దోషాలు చేశారని అప్పట్లో ఫిర్యాదు చేయగా దానిని విచారించిన అప్పటి బాపట్ల డిఎస్పి కుల దూషణ జరగలేదని, ఆనాడే నిర్ధారణ చేసి కేసును మూసివేసినట్లు తెలిపారు. అయినప్పటికీ మరియమ్మ 2018లో గుంటూరు 4వ సెషన్స్ కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు దాఖలు చేయగా ఏడేళ్ల పాటు విచారణ జరిపిన అనంతరం ఎలాంటి సాక్షాదారాలు లేని కారణంగా సోమవారం కేసు కొట్టివేసినట్లు తెలిపారు.

పెట్రోల్ లీకై బైక్ దగ్ధం

ప్రజాశక్తి - రేపల్లె

దగ్ధమైన బైకు

పెట్రోలు లీకై బైక్ పూర్తిగా దగ్ధమైన ఘటన పట్టణంలోని 14వ వార్డులో జరిగింది. వార్డుకు చెందిన తురక శివ గణేష్ బైక్ స్టార్ట్ చేయడంతో అప్పటికే పెట్రోల్ ట్యాంక్ లీకై ఉండటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి బైకు అంటుకున్నాయని అగ్నిమాపక అధికారి సాంబశివరావు తెలిపారు. దీంతో బైక్ పూర్తిగా దగ్ధమైందని అన్నారు. రూ.30వేల ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమై మంటలు అదుపు చేసినట్లు తెలిపారు.

దామచర్ల జనార్ధన్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

'జనం కోసం జనార్ధన్'

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జనం కోసం జనార్ధన్, బాబు షఉరిటీ భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమం నగరంలోని 17వ డివిజన్ రాంనగర్ 10వ లైన్‌లో సోమవారం నిర్వహించారు. దామచర్ల జనార్ధనరావుకు టిడిపి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. పలువురు మహిళలు హారతులిచ్చి ఆహ్వానించారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు. మాజీ శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు ఇంటింటికి వెళ్లి మహిళలు, యువతతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. డివిజన్‌లో మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ చంద్రబాబు ఒక విజన్ ఉన్న నాయకుడని అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే ఆయన మళ్లీ సిఎం కావాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలుపు అత్యవసరమని, ఇందుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి శ్రీనివాసరావు, కామేపల్లి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరావు, బండారు మదన్, టివి శ్రీరామ్మూర్తి, రాచగర్ల వెంకట్రావు, 17వ డివిజన్ అధ్యక్షులు సున్నిబోయిన జాలయ్య, అన్నం అంజమ్మ, బడే ఆదిత్య, పసుపులేటి అనిల్, చలసాని పవన్ కుమార్, కొక్కిరాల యస్వంత్, సాయి పాల్గొన్నారు.

11న కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు బకాయిల నిధులు రూ.1650 కోట్లు వెంటనే విడుదల చేయాలని ప్రకాశం జిల్లా ఐక్య విద్యార్థి సంఘటన నాయకులు డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 11న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపడుతున్నట్లు ప్రకటించారు. ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు, విద్యార్థి జెఎసి సంఘాల నాయకుల ఉమ్మడి సమావేశం సోమవారం స్థానిక ఎల్‌బిజి భవన్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి ఎల్ రాజశేఖర్, విద్యార్థి జెఎసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ జగదీష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.విజయ్ పాల్గొని కార్యక్రమం రూపకల్పన చేశారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు బకాయి లను ప్రభుత్వం తక్షణమే చెల్లించా లని డిమాండ్ చేశారు. ఈనెల 11న కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

మాట్లాడుతున్న వినోద్

పెండింగ్ జీతాలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు, క్యాబ్ డ్రైవర్లకు, కోవిడ్ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వా లని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐ టియు) ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం నగరంలోని అన్ని మస్టర్ పాయింట్ల వద్ద ధర్నాలు నిర్వహిం చారు. ఈ ధర్నాల నుద్దేశించి యూని యన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీని వాసరావు, సిఐటియు నగర కార్యదర్శి టి మహేష్ మాట్లాడుతూ ఆప్కాస్‌లో పనిచేసే కార్మికులకు రెండు నెలల జీతాలు, క్యాబ్ డ్రైవర్లకు నాలుగు నెలల జీతాలు, కోవిడ్ కార్మికులకు నాలుగు నెలల నుంచి ఎనిమిది నెలల వరకు జీతాలు పెండింగ్‌లో ఉన్నా యని తెలిపారు. గత కమిషనర్ మున్సిపల్ వర్కర్ల జీతాలను వారి అకౌంట్ నుంచి మళ్లించి కాం ట్రాక్టర్లకు బిల్లులు చెల్లించినం దున ఈ సమస్య వచ్చిందన్నారు. ప్రస్తుత కమిషనర్ అకౌంట్‌లో డబ్బులు లేవని కార్మికులకు జీతాలు చెల్లించడం లేదన్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నగర కార్యదర్శి రత్న కుమారి, నాయకులు కె.మోహన్‌రావు, రాములు, బాబు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు